క్లుప్తంగా

పక్కాగా భూముల రీసర్వే


మాట్లాడుతున్న తహసీల్దారు రాజారావు

డెంకాడ: మండలంలో భూముల రీసర్వే పక్కాగా జరుగుతోందని తహసీల్దారు ఎన్.రాజారావు తెలిపారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం పెదతాడివాడలో సర్వే జరుగుతోందని, ఏడు బృందాలతో సర్వే వేగవంతానికి చర్యలు తీసుకున్నామన్నారు. రైతులు ఎదుర్కొంటున్న భూ తగాదాలు పరిష్కారమయ్యేలా చూస్తున్నామన్నారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీకాంత్

పూసపాటిరేగ: మండల తహసీల్దారుగా ఎన్వీ రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడి తహసీల్దారుగా పనిచేసిన తాడ్డి గోవింద..కలెక్టరేట్ సి-సెక్షన్‌కు బదిలీ అయ్యారు.

నెల్లిమర్ల: మండల తహసీల్దారుగా కె.శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఈయన కలెక్టరేట్‌లోని ఏవోగా విధులు నిర్వర్తించగా బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన సుదర్శన రావు సంతకవిటి మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ మేరకు కొత్తగా విధుల్లో చేరిన తహసీల్దారుకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వసతిగృహాల సందర్శన


దేవుపల్లిలోని వసతిగృహాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్, తదితరులు

బొండపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంతో పాటు దేవుపల్లిలోని బీసీ బాలికల వసతిగృహాన్ని గజపతినగరం ఫస్ట్ క్లాస్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్ రాజ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం వసతిగృహాధికారులతో మాట్లాడుతూ.. వసతిగృహంలో విద్యార్థినులు ఎంతమంది ఉన్నారు.. వారికి అందిస్తున్న సౌకర్యాలు.. ఇంకా ఏయే సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నదానిపై ఆరా తీశారు. మెను ప్రకారం భోజనాలు పెడుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది కె.సాయికిషోర్, తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే విద్యారంగ అభివృద్ధి


విద్యాసామగ్రి అందజేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు


దత్తిరాజేరు: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి హయాంలోనే విద్యారంగం ఎంతో అభివృద్ధి చెందిందని గడసాం వైఎస్సార్‌సీపీ నాయకుడు నేతేటి వెంకటరమణ అన్నారు. గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు శుక్రవారం విద్యాకిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అశ్రునివాళి..


నివాళులర్పిస్తున్న విద్యార్థులు, లెక్చరర్లు

శృంగవరపుకోట: అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది శుక్రవారం నివాళులర్పించారు. ఎన్‌సీసీ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ ఈరన్న ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు కొవ్వొత్తులు వెలిగించి, వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి సన్నిధిలో జడ్జి


జిల్లా జడ్జి బబితను ఆశీర్వదిస్తున్న అర్చకులు

చీపురుపల్లి: మండల కేంద్రంలోని కనక మహాలక్ష్మి అమ్మవారిని జిల్లా జడ్జి ఎం.బబిత శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలకగా.. అర్చకులు వేదమంత్రాలతో అమ్మవారి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఆమె వెంట డీఎల్ఎస్ఏ కార్యదర్శి కృష్ణ ప్రసాద్, చీపురుపల్లి జెడ్జి ఎఫ్ఏసీ పి.బుజ్జి ఉన్నారు. అనంతరం చీపురుపల్లి కోర్టు నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.

పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపడాలి


అధికారులకు సూచనలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: నగరంలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపడాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్యంపై అధికారులతో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన కాసేపు మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు ఏర్పాటు చేయాలని ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తికి సూచించారు. యూజర్ చార్జీలు, ట్రేడ్ లైసెన్స్‌ల విధింపు, వసూళ్లను ఈ నెలాఖరు నాటికి శతశాతం పూర్తి కావాలన్నారు. వర్షం తగ్గిన తర్వాత క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి నిల్వలు గుర్తించి తక్షణమే ప్రక్షాళన జరిగేలా చూడాలన్నారు. మీడియం, మైనర్ కాలువలను పరిశుభ్రంగా ఉంచేలా పర్యవేక్షించాలన్నారు. నీటినిల్వలు ఉన్నచోట ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. దోమల నియంత్రణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పక్కాగా పాటించేలా చూడాలన్నారు. ఫాగింగ్, స్ప్రేయింగ్‌లు ముమ్మరం చేయాలన్నారు. దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. వర్షాల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిఇంటి నుంచి తడిచెత్త సేకరణకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సేకరించిన తడిచెత్తతో ఎరువులు తయారు చేయాలన్నారు. నగరంలో నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం లేకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు సిబ్బంది దుకాణాలు, షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు.

సహస్ర దీపారాధన


దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపారాధన శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వెండి మంటపంలోని స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ ఊరేగించి, దీపారాధన మంటపంలోని ప్రత్యేక ఊయలలో ఉంచారు. అనంతరం వెయ్యి దీపాలు వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత స్వామి ఊంజల్ సేవ చేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు


అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న సిబ్బంది

విజయనగరం: అక్రమ నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పునరుద్ఘాటించారు. నగర పరిధిలోని తోటపాలెంలో ఓ భవనంపై అనుమతులు లేకుండా చేస్తున్న నిర్మాణాలను తొలగించాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు సిబ్బంది గురువారం వెళ్లి, అనుమతులు తీసుకోకుండా చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేశారు. అనుమతులు లేకుండా ఎటువంటి నిర్మాణాలు గానీ అదనపు భవనాలు గానీ నిర్మించవద్దని కమిషనర్ తెలిపారు.

యోగాతో ఆరోగ్యం మెరుగు



విజయనగరం అర్బన్: యోగా సాధన చేస్తున్న వర్సిటీ అధికారులు, విద్యార్థులు

విజయనగరం: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా అలవాటు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా నగరంలోని పాల్‌నగర్‌లో యోగాపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో ముఖ్యమైన వాటిలో యోగా ఒకటని, ప్రతిఒక్కరూ యోగాను జీవనశైలిలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్ర వేళల్లో యోగా చేసుకుని, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు.

విజయనగరం అర్బన్: స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం(జీవీ) ప్రాంగణంలో శుక్రవారం యోగాసనాల సాధన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి హాజరై, యోగాసనాల ప్రయోజనాలు వివరించారు. యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం


యోగాపై అవగాహన కల్పిస్తూ అధికారుల ర్యాలీ

పొందవచ్చని, ప్రతిఒక్కరూ తమ దినచర్యలో యోగాను చేర్చుకోవాలని కోరారు. ఇక్కడి వర్సిటీతో పాటు అనుబంధ కళాశాలల్లోనూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఆన్‌లైన్‌లో యోగా తరగతులు చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను పునరుద్ధరించండి

నెల్లిమర్ల: నగరపంచాయతీ పరిధిలోని నాయుడు కాలనీ పంప్‌హౌస్(తాగునీటి పంపిణీ కేంద్రం)ను చైర్‌పర్సన్ బంగారు సరోజిని శుక్రవారం పరిశీలించారు. గత కొన్నిరోజులుగా కాలనీవాసులకు తాగునీటి సరఫరా నిలిచిపోయినందున ఏమై ఉంటుందనే ఉద్దేశంతో ఆమె పంప్‌హౌస్‌ను సందర్శించగా, అక్కడి పైపులైన్ మరమ్మతులకు గురైన విషయం తెలిసింది. త్వరితగతిన బాగుచేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని సిబ్బంది ఆమె ఆదేశించారు.

విత్తనాల కొరత ఉండకూడదు..

దత్తిరాజేరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం వద్ద ఏఓ అనురాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరితో కలిసి రైతులకు శుక్రవారం విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రకాల విత్తనాలు సిద్ధం చేసి రైతులకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ డోల చంద్రమ్మ, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, నాయకులు ఫణీంద్రుడు, త్రినాథ్, బంగారునాయుడు, ఈశ్వరరావు, బండి కృష్ణ, సత్యారావు, గౌరినాయుడు, ఏఈఓ నీలాకృష్ణ, వీఏఏ సతీష్ పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

బొండపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేపట్టేవారు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని వ్యవసాయశాఖ జేడీ వీటీ రామారావు అన్నారు. మండలంలోని గొట్లాం రైతుసేవా కేంద్రంలో శుక్రవారం రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విత్తనశుద్ధికి అవసరమైన సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ మందును విత్తనాలతో పాటు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రైతులు మందు తీసుకుని విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. అలాగే పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు రాయితీపై విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ కె.మహరాజన్, ఏఓ పీవీ మల్లికార్జునరావు, వ్యవసాయశాఖ సిబ్బంది సంతోష్, ప్రియదర్శిని, సిరి చందన, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా భావించాలి


రక్తదాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి రక్తనిధి(బ్లడ్‌బ్యాంకు) వద్ద ప్రపంచ రక్తదాతల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి కాసేపు మాట్లాడారు. రక్తదానానికి అందరూ ముందుకురావాలన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలు వీడాలని, ఆరోగ్యవంతమైన వ్యక్తి ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. మనమిచ్చే రక్తం ఒకరి ప్రాణాలు కాపాడడమే కాకుండా ఆ కాపాడిన ప్రాణం మీద ఆధారపడి జీవించే మరికొంతమంది ప్రాణాలు బతికించినవారమవుతామన్నారు. అనంతరం రక్తదానం చేసిన వైద్య విద్యార్థులు, ఇతరులను అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధీర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ రమణి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ సూచించారు. నగర పరిధిలోని తోటపాలెంలో ఉన్న గాయత్రి జూనియర్ కళాశాల, ఎంఎస్ఎన్, ఏజీఎల్ కళాశాలల్లో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో యువత ఫ్యాషన్ మాయలో పడి చెడు అలవాట్లకు బానిసలవుతున్నారని, జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా, సిగరెట్, సారా, మద్యం వంటి మత్తు పదార్థాలను తీసుకోవద్దన్నారు. ఉన్నతమైన వ్యక్తిత్వంతో ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. ఈగిల్(ఎలైట్ యాంటీ నార్కోటిక్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) సంస్థలో పోలీస్ శాఖ అనుసంధానమై మాదక ద్రవ్యాల నియంత్రణకు శ్రీకారం చుట్టిందన్నారు. డీజీపీ హరీష్‌గుప్తా, ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

యోగాతో అనారోగ్యాలకు చెక్


యోగాసనాలు వేస్తున్న వివిధ శాఖల సిబ్బంది

వేపాడ: ప్రతి రోజూ యోగా చేయడం వల్ల అనారోగ్యాలకు చెక్ పెట్టవచ్చని ఎంపీడీఓ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది, వీఓఏలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, ఉపాధి క్షేత్ర సహాయకులు హాజరై యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీరందేదెలా...!

- నిర్వహణ లేని సాగునీటి కాలువలు
- రెల్లి గడ్డి, గుర్రపు డెక్కలతో నిండిన సాగునీటి వనరులు
- గాలికొదిలేసిన ఇరిగేషన్
- ఖరీఫ్‌లో ఆయకట్టుకు సాగునీరందని దుస్థితి


రాజాం మండలం బొద్దాం వద్ద అధ్వానంగా తోటపల్లి ప్రధాన కాలువ

రాజాం: నియోజకవర్గంలో ఖరీఫ్ పంటల సాగుకు ప్రధాన ఆధారమైన సాగునీటి కాలువల పరిస్థితి దయనీయంగా మారింది. అధిక శాతం పంటలు సాగునీటి కాలువల ఆధారంగానే పండాల్సి ఉంది. ఈ ఏడాది వేసవిలో సాగునీటి కాలువలు నిర్వహణ చేయకపోవడంతో ముంచుకొచ్చిన ఖరీఫ్‌కు సాగునీరు కష్టంగా మారనుంది. గతేడాది కాలంగా సాగునీటి కాలువల ఆధునికీకరణ లేకపోగా, వేసవిలో నిర్వహించే తాత్కాలిక పనులు కూడా ఈ ఏడాది చేపట్టలేదు.

తీరుతెన్నూ లేని తోటపల్లి

నియోజకవర్గంలో రాజాంతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. ఖరీఫ్‌లో ఒక్క రాజాం మండలంలో మాత్రమే ఈ కాలువ ద్వారా కొంత ఆయకట్టుకు సాగునీరు అందే పరిస్థితి ఉంది. ఉప కాలువల ద్వారా రేగిడి, సంతకవిటి మండలాలకు అందాల్సిన నీరు ఒక్క చుక్క కూడా రావడం లేదు. రాజాంలో కంచరాం, బొమ్మినాయుడువలస, బొద్దాం, ముద్దాడజోగివలస తదితర ప్రాంతాలను ఆనుకుని ఉన్న ఈ కాలువలో పూడికలు పెరిగిపోయాయి. వీటి తొలగింపునకు గతంలో ఉపాధి పనులు చేయగా ఇప్పుడు వాటిని అలా వదిలేశారు. ఇరిగేషన్ నిర్వహణ పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో ఖరీఫ్‌లో కాలువ ద్వారా సాగునీరు అందాల్సిన 7200 ఎకరాల ఆయకట్టుకు కష్టం తప్పదన్నట్టుగా ఉంది.

మడ్డువలస ఆయకట్టు వివరాలు..	
మండలం	ఆయకట్టు
వంగర	996.94 ఎకరాలు
రేగిడి	6,700.76 ఎకరాలు
సంతకవిటి	10,976.06 ఎకరాలు
జి.సిగడాం	6,029.03 ఎకరాలు
పొందూరు	99.20 ఎకరాలు
లావేరు, ఎచ్చెర్ల	5200 ఎకరాలు(స్టేజ్-2)

మడ్డువలస నిర్వహణేది..

నియోజకవర్గంలో వంగర మండలంలోని గొర్లె శ్రీరాములనాయుడు మడ్డువలస ప్రాజెక్ట్ ద్వారా వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లో 19 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉంది. కాలువలో ఎక్కడికక్కడే ప్రాజెక్ట్ ద్వారా వరదల సమయంలో వచ్చిన గుర్రపు డెక్క చేరింది. ఇది కాలువలతో పాటు పరిసర ప్రాంతాల్లో దిబ్బలుగా ఏర్పడి నీరు ప్రవహించని పరిస్థితి ఉంది. కాలువలో ఆధునికీకరణతో పాటు ఇతర అభివృద్ధి పనులు ప్రభుత్వం చేయకపోవడంతో పాటు ఇరిగేషన్ శాఖ నిర్వహణను పక్కన పడేసింది. ఖరీఫ్‌లో ఈ కాలువ ద్వారా థైలాండ్ ప్రాంతాలతో పాటు ఆయకట్టుకు కూడా సాగునీరు అందని పరిస్థితి కనిపిస్తోంది.

నారాయణపురం ఆనకట్ట వైపు కన్నెత్తి కూడా చూడలేదే..


నియోజకవర్గంలో సంతకవిటి మండలంలో విస్తరించి ఉన్న నాగావళి నది నారాయణపురం ఆనకట్ట కుడికాలువ ద్వారా సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాల్లో 18,700 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. సంతకవిటి మండలంలో 5,190 ఎకరాల్లో ఆయకట్టు ఉంది. జైకా నిధులతో అక్కడక్కడ పనులు చేసిన అధికారులు వదిలేశారు. ఈ ఏడాది ఉపాధి పనులతో పాటు మెయింటినెన్స్ పనులు కూడా ఇంతవరకూ చేయలేదు. ఈ కాలువ ద్వారా సాగునీరు ఖరీఫ్‌లో ఆయకట్టుతో పాటు పిల్ల కాలువలకు కూడా గగనంగానే కనిపిస్తోంది.


సంతకవిటి మండలం మంతిన-మల్లయ్యపేట సమీపంలో నారాయణపురం కుడి కాలువ దుస్థితి

ఓపెన్‌హెడ్ చానల్స్..

రాజాం నియోజకవర్గంలో రాజాంలో సారధిగెడ్డ, రేగిడిలో ఏకేఎల్ గెడ్డ, రేగిడి, సంతకవిటి మండలాల్లో సాయన్నగెడ్డలు ప్రధాన సాగునీటి కాలువలు కంటే కూడా మంచిగా ఆయకట్టుకు సాగునీరు అందించే కాలువలుగా గతంలో ఖ్యాతి ఉండేది. ప్రస్తుతం ఈ కాలువలు ఆయకట్టుకు కూడా నీరు అందివ్వలేని పరిస్థితి ఉంది. ఓపెన్ హెడ్ చానల్స్‌గా ఉన్న సాయన్న చానల్ పూర్తిగా కలుపుతో నిండిపోయింది. రేగిడి, సంతకవిటి మండలాల్లో వీటి షట్టర్లు పూర్తిగా పాడవ్వడం, మదుములు అంతరించిపోవడంతో ఖరీఫ్‌లో ఆయకట్టుకు పంట విషయం పక్కనపెడితే ముంపు అధికమౌతుంది.

తోటపల్లి నీరు లేదు



రేగిడి మండలంలో తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు అందాల్సిన గ్రామాలకు నీరు అందడంలేదు. అధికారులు అందుబాటులో ఉండరు. మండల సమావేశాలకు రారు. మడ్డువలస కాలువ పరిస్థితి అలానే ఉంది. ఎప్పుడు గట్లు కొట్టుకుపోతాయో తెలియని పరిస్థితి ఉంది. ఓపెన్ హెడ్ చానల్స్ పట్టించుకునే నాథుడే లేడు.

– వావిలపల్లి జగన్మోహనరావు, వైస్ ఎంపీపీ, రేగిడి మండలం


రేగిడి మండలం అంబఖండి సమీపంలో మడ్డువలస కాలువ దుస్థితి

ఒక్క మదుము కూడా లేదు



నారాయణపురం కుడి కాలువకు మా గ్రామం వద్ద ఆధునికీకరణ చేశారు. మదుములు విడిచి పెట్టమంటే విడిచిపెట్టలేదు. కాలువ ఎగువ భాగాన గుర్రపుడెక్క చేరిపోయింది. సాగునీరు ఇక్కడకు వచ్చి నిలవలేని పరిస్థితి ఉంది. మదుములు లేక పొలాలకు నీరు రాదు. సాయన్నచానల్ మొత్తం అస్తవ్యస్తంగా ఉండడంతో చిత్తారిపురం, వాల్తేరు, బూరాడపేట, మంతిన, మల్లయ్యపేట, రామారాయపురం, గుజ్జన్నపేట గ్రామాల్లో వేలాది పంటపొలాలు ముంపునకు గురౌతున్నాయి. కాలువలు ద్వారా సరైన సమయంలో నీరు రాని పరిస్థితి ఉంది. – గురుగుబెల్లి స్వామినాయుడు, వాల్తేరు, సంతకవిటి మండలం

దృష్టి సారించాం..

మడ్డువలస ప్రధాన కాలువలతో పాటు పిల్ల కాలువలోల్ మెయింటినెన్స్ పనులకు పలుచోట్ల ఏరియాలు వారీగా పరిశీలనలు చేశాం. ఈ ఏడాది వేసవిలో మెయింటినెన్స్ నిధులు రాలేదు. కాలువలో నీటిని విడిచి పెట్టే ముందు ట్రైల్ రన్ వేసి, ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– బి.వెంకట్, ఏఈ, మడ్డువలస కాలువ సబ్‌బ్‌డివిజన్, రాజాం.